"బావా ఒకకథ రాసిపెట్టవూ?" అని మారాం చేశాడు మా బావమరది.

"నాకు కథలు రావురా బాబూ" అని యెంత గోలపెట్టినా వింటేనా! వాడొక పెంకి వెధవ.

"పోనీలెండి; పిల్లవాడు అంతగా అడుగుతుంటే ఒక్క కథ రాయ రాదు?" అని సలహాయిచ్చింది మా అర్ధాంగి.

"సరేలే! మహా పెద్ద సలహా లియ్యటానికి వచ్చేవు. నువ్వు రాయ రాదూ నాకు చెప్పకపోతే? ఏ భక్త విజయములోనన్నా కాపీకొట్టి రాయలేక పోయావా?" అన్నాను నవ్వుతూ.

నిజంగానే నాకు కథలు రాయటం చేతగాదు. అసలు చదవటం అంటేనే నాకు కిట్టదే? కథలెల్లా రాసేదీ!...రాయక తప్పలేదు' ఎల్లా వ్రాయటం-అదే పెద్దసమస్య యిప్పుడు.

చివరికి ఎలాగైతే నేం-మొదలు పెట్టాను, తాపీగా, కుర్చీలో కూచుని. "అనగా అనగా" అని రాస్తున్నా.

"అదేంటి బావా? 'అనగా అనగా'—అట్లాంటి కథలు నాకు వద్దు. మంచికథ రాయ్!" అన్నాడు శనిగాడికి మల్లే పక్కనే కూచుని నా బావమరది.

ఆవాక్యం కొట్టేసి మళ్లీ వ్రాశాను "బృందావనంలో గోపాల కృష్ణుడు..." అని.

"అబ్బే అదేం కథ బావా? అట్లాంటి పురాణ కథలు మా హిష్టరీలో చదివాలే! మంచివి రాయాలిగాని"...అన్నాడు వాడు.

నాకు నవ్వు వచ్చింది అల్లాంటి కథలు సైన్సులో చదివావనలేదు; వాడిపుణ్యమా అంటూ!

మళ్ళీ మొదలు పెట్టాను. "అది శరద్రాత్రి. ఆకాశంలో చంద్రుడు చరచరా పరుగెత్తుతున్నాడు..."

[illegible]

"ఎక్కడికి బావా చరచరా పరుగెత్తి పోయేది?" మళ్ళీ అడ్డు తగిలాడు. నాకు వొళ్లు మండు కొచ్చింది.

"అరే శకునపక్షీ! నువ్విక్కడి నుంచి కదులు. ఏదో పాపం గదా అని కథ రాసిపెట్టుంటే,మధ్య యీ ప్రశ్నలేమిటి?"అన్నాను కోపంగా.

మావాడు యేరంధి నున్నాడో "సరే నేను పోతున్నాలే కానీ మంచికథ రాయాలి తెలుసా?"అని లేచి చక్కా పోయాడు.

సిగిరెట్టు ముట్టించి దమ్ము లాగుతూ ఆలోచించా. "రామాపురం అగ్రహారంలో మాధవరావు అనే బ్రాహ్మణ యువకుడు వున్నాడు. అతను B. A. మొదటి సంవత్సరములోనే లక్ష్మి అనే అమ్మాయిని ప్రేమించి పెండ్లి చేసుకొన్నాడు. మాధవరావుకు...

"పోస్టుసార్" అని కేక వినిపించింది. 'వీడి తస్సాదియ్యా ఇప్పుడే దాపురించాడు, వీడు కూడా' అని విసుక్కొంటూ కాగితాలు అక్కడే పడేసి వెళ్ళి, ఉత్తరం తీసుకున్నాను. మాయింటి యెదురుగుండా వున్న కిళ్ళీ కొట్టుకి వెళ్లి ఒక సిగిరెట్టు పాకెట్టు తీసుకుని వచ్చి కూర్చున్నా.

కథ యెంతవరకు అయిందో మొదటినుంచి చదివి చూతునుకదా అని మళ్ళీ 'మాధవరావుకు'; అన్నంత వరకూ నాదస్తూరీయే. దానిపక్కనే యింకొకరి దస్తూరీ వుంది - 'మంచి పెసరగారెలంటే మహాయిష్టం' అని! నాకువొళ్ళు మండింది.

"లక్ష్మి" అని గావు కేకవేశాను లక్ష్మి వచ్చింది-నవ్వుతూ!

"ఏమటీ యీపిచ్చి పిచ్చివేషాలు ఇది కథా, కాకరకాయా? నీయిష్టం వచ్చినందంతా యిందులో రాసేస్తే ఎలాగను కొన్నావ్?" చెంపదెబ్బ పెట్టినంత యిదిగా అడిగేశాను.

"అదేమి కథండీ, పిల్లలకి యివేమి అర్థమవు తాయండీ? ప్రేమ, పెండ్లి, యీగొడవ అంతా



"వాళ్ళకెందుకు తెలుస్తుందీ?- ఏదో పేదరాశి పెద్దమ్మ కథలు రాయక!" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

లక్ష్మి చెప్పినమాట, నిజమేనని పించింది. అపరాధ-యాత్రేమ పెళ్లి గొడవలు పిల్ల లకెందుకూ? పేదరాశి పెద్దమ్మకథ రాద్దామనుకొన్నాను. ఆలోచిస్తూ కూచున్నా. ఎంత ఆలోచిస్తే మటుకు లోపల ఏమున్నా నరుకుంటేగా - రాయటానికి! కలం అలానే వుండిపోయింది, కాగితం మీద.

ఎలాగైతే నేం-మూడు గంటలు ఆలోచించి మూడు పేజీలు పూర్తి చేశా. ఈ లోపల మావాడు పద మూడుసార్లు వచ్చాడు "అయిందా బావా?" అంటూ.

"అరే! మీ అక్కయ్యను పిలవరా-కథ చదువుతాను" అన్నాను చదవటం మొదలుపెట్టాను. నేను చదువుతున్నంత సేపూ, మా ఆవిడ పగలపడి నవ్వుతోంది. ఆనవ్వు చూసి, నేను కల్పించి రాసిన కథ అంత బాగావుందని కాబోలు అనుకుంటూ, కథ చదవటం పూర్తి చేశాను.

నవ్వు ఆపుకోలేక "అరేయ్! మీ బావ, పాపం! ఇంత కష్టపడి రాసి అలిసిపోయారల్లే వుంది. కాసిని కాఫీ నీళ్ళు తీసుకోమని చెప్పరా" అంటూ, కాఫీ కప్పు అందించింది.

"ఇదేనా నువ్వు రాసింది ఇందా కటిబట్టీ? ఇది రాత్రి అక్కయ్య చెప్పిన కథేగా! ఇది మా 'నానీ' వ్రాసి పత్రిక్కి ఇదివరకే పంపించాడు." అన్నాడు మావాడు. నా ముఖంలో నెత్తురుచుక్క లేదంటే నమ్మండి!

"అరె! మీ బావ మూడు గంటలు కష్టపడి రాస్తే అల్లా అనేస్తా వేమిరా? పాపం సొంతంగానే రాశారు కాబోలు" అంది వెక్కిరిస్తూ వాళ్ల అక్కయ్య.

"చాల్లే వూరుకో" అన్నా ముఖం కందగడ్డలా పెట్టి. "ఇంకొద్దులే బావా" అన్నాడు మావాడు సముదాయింపుగా.

"అరె! మీ బావ సొంతంగా రాస్తాడురా. భక్తవిజయంలో కథ ఎందుకు కాపీ చేస్తాడు?" అంటూ వుంటుంది దొంగ తాళిగా లక్ష్మి ఇప్పటికీ. నాకు ఒళ్ళుమండేది. కానియేమి చేయను? "ఓస్ నేను రాయలేకనా? నీతమ్ముడు కథలు రాయమని అడగండే నే నెందుకు రాస్తానూ? కాకపోయినా-వాడు ఇక ఎప్పుడు నన్ను కథ వ్రాయమని వేధించకుండా చేయటం కోసమే అల్లా రాశేను, అప్పుడు" అని సమాధించుకున్నాను.